సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచే స్తున్న మేడికొండ ఆశాకిరణ్‌కు డాక్టరేట్ దక్కింది. కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో తిరుచ్చిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 'క్లౌడ్ సహాయక ఐఓటీలో సమర్థవంతమైన, సురక్షితమైన సూన్ క్రిప్షన్ స్కీమ్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు అతనికి డాక్టరేట్ ప్రదానం చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. ఈశ్వరి, హైదరాబాద్ ఐడీఆర్‌బీటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. శ్యామ్‌కుమార్ మార్గదర్శకత్వంలో పరిశోధన పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, విభాగాధిపతి ప్రొఫెసర్ వై.రమాదేవి, ఐక్యూస్ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. మదన మోహన్, ప్రొఫెసర్ కె. ప్రభాకర్‌తో పాటు మేనేజ్‌మెంట్, డైరెక్టర్లు, విభాగాధిపతులు ఆయనను అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రాణాంతకంగా పైపులైన్ పనులు

- నడిచేదారి లేక రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- గత్యంతరం లేక ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళుతున్న విద్యార్థులు

పట్టు తప్పితే అంతే..

రాజేంద్రనగర్ సర్కిల్, శివరాంపల్లిలో సుమారు రూ.80 లక్షలతో చేపట్టిన వరదనీటి పైపులైన్ పనులు ప్రాణాంతకంగా మారాయి. నెలల తరబడి పనులు కొనసాగుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్తీలో నుంచి బెంగుళూర్ జాతీయ రహదారికి వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం కావడంతో పనుల్లో జాప్యం కారణంగా రాకపోకలు నిలిచిపోయాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల, హాస్టల్స్ ఉండటంతో విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. –రాజేంద్రనగర్

ఎన్నికల హామీలను అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా కార్యదర్శి ఎ.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15వేల రైతు భరోసా, కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సాయం హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను తగ్గించేందుకు కుట్రలు చేస్తుందని వారు ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ దాటి పోతున్నా ఇప్పటి వరకు రైతు భరోసా, కౌలు రైతులకు పెట్టుబడి ఖర్చు ఇవ్వకపోవటం దారుణమన్నారు. రుణమాఫీ కాకపోవటంతో రైతులకు కొత్త రుణాలు అందక డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నారన్నారు. చేతకాని హామీలు ఇచ్చి రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో రైతుల తరఫున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతి యాదవ్, సీనియర్ నాయకుడు సత్యనారాయణ, జిల్లా కార్యవర్గసభ్యులు ఎం. నగేష్‌యాదవ్, ఎస్. బుచ్చిరెడ్డి, కిసాన్ మోర్చ మున్సిపల్ అధ్యక్షుడు డి. మల్లేష్, మున్సిపల్ నాయకులు జి.శివరాజ్, డి. నవీన్, డి. నాగేష్, డి. శ్రీనివాస్, బి, కిరణ్, చంద్రశేఖరప్ప, ఎం. అనిల్‌కుమార్, డి. శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హుడా బడి మాస్టారు బదిలీ



బదిలీ ఉత్తర్వులు అందుకున్న మల్లేష్

శంషాబాద్: అవార్డుల పాఠశాలగా గుర్తింపు పొందిన హుడాకాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్ బదిలీ అయ్యారు. గత ఎనిమిదేళ్లుగా టీచర్‌గా పని చేస్తున్న ఆయన పాఠశాలను హరితమయంగా తీర్చిదిద్ది హరిత పాఠశాల అవార్డును సాధించడంతో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డులను సైతం అందుకున్నారు. దాతల సహకారంతో ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దడంతో హుడా బడి ప్రత్యేక గుర్తింపు పొందిది. ఆయన షాబాద్ మండలం, ఎలిగొండ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. మంగళవారం ఎంఈఓ మధుకర్ ఆయనకు బదిలీ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సహచర ఉపాధ్యాయులు దత్తంరెడ్డి, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు శాలువాలతో సన్మానించారు.

జెండర్ సెన్సిటైజేషన్‌పై ముగిసిన వర్క్‌షాప్



జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ: రావ్ బహదూర్ వెంకట్రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. జూలై 8,9 తేదీలలో అకాడమీలో శిక్షణ పొందుతున్న 538 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బందికి జెండర్ సెన్సిటైజేషన్ అంశంపై ఈ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌సీడబ్ల్యూ చైర్ పర్సన్ రేఖాశర్మ మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో ఎపోలీసుల పరస్పర చర్యలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నందున చట్టాన్ని అమలు చేసే సంస్థలు లింగ వివక్ష, సున్నితత్వం ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలన్నారు. పోలీసింగ్‌లో లింగ వివక్ష, పక్షపాతం, సున్నితత్వం అనేది పరిష్కరించాల్సిన ముఖ్యమైన సమస్యగా ఆమె పేర్కొన్నారు. టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్త్ మాట్లాడుతూ కార్యాలయాల్లో మహిళలు తమ బాధ్యతలను నిర్వహించటానికి సౌకర్యాలను కల్పించాలన్నారు. శిక్షణార్థులకు తమ అకాడమీలో వారి పసిపిల్లలతో పాటు వసతి కల్పించినట్లు తెలిపారు. మహిళలపై నేరాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పోలీసుల పాత్ర, లింగ వివక్ష సున్నితత్వం, లైంగిక నేరాలపై చట్టపరమైన నిబంధనలు, యాసిడ్ దాడులు, ఒత్తిడి నివారణ, మహిళలపై సైబర్ క్రైమ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ వక్తలు డాక్టర్ బి.సంధ్య, కౌన్సెలర్ తునికా, రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ ఏడీజీ మహేష్ భగత్, సైకాలజిస్ట్, బాడీ ల్యాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్ గౌరవ్‌గిల్, సైబర్ లా నిపుణులు, సోనాలి పట్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

స్పోర్ట్స్ అనలిటిక్స్ కోసం అధునాతన అల్గారిథమ్‌లు

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్పోర్ట్స్ అనలిటిక్స్ కోసం అధునాతన అల్గారిథమ్‌లు, డేటా మోడల్‌లను అభివృద్ధి చేయడానికి అథ్‌లైట్ ఇంక్ సహకరిస్తుంది. ఈ మోడల్‌లు, అల్గారిథమ్‌లు అథ్లైట్ నెక్ట్స్ జనరేషన్ స్పోర్ట్స్ కమ్యూనికేటర్స్ టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్ మెరుగుపర్చడానికి ఉపయోగపడతాయి. ఈ ప్లాట్‌ఫారమ్ యూఎస్ కళాశాల స్పోర్ట్స్ కమ్యూనికేటర్‌లు గణాంకాలు, ఇతర క్రీడా సమాచారాన్ని శోధించడంలో, అధునాతన భాషా నమూనాలను ఉపయోగించి డేటా నుంచి కథనాలను రూపొందించడంలో ఉపయోగపడుతుంది. ప్రొఫెసర్ మనీష్ శ్రీవాస్తవ నేతృత్వంలోని ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ బృందం అథ్లైట్ స్పోర్ట్స్ డేటా, ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన సహజ భాష–ఆధారిత శోధన ఇంజిన్‌ను అభివృద్ధి చేయడం, డేటా మైనింగ్, ప్యాటర్న్ రికగ్నిషన్, ఏఐ ఉపయోగించి స్పోర్ట్స్ కంటెంట్, స్టోరీలను రూపొందించడం వంటి ప్రాజెక్ట్‌లపై అథ్లెట్ బృందం సభ్యులతో సంయుక్తంగా పనిచేస్తుంది. ఈ సందర్భంగా డాక్టర్ మనీష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ సహజ భాషా ప్రాసెసింగ్‌లో ప్రస్తుత పురోగతి, స్పోర్ట్స్ అనలిటిక్స్ ఈ పురోగతి నుంచి పెద్దగా ప్రయోజనం పొందలేకపోయామన్నారు. ఈ భాగస్వామ్యం కోసం ఎదురు చూస్తున్నామన్నారు. భవిష్యత్తులో గణనీయమైన ప్రభావాన్ని చూపగలమనే నమ్మకం పెరిగిందన్నారు. అథ్‌లైట్ ఇంక్ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ కిరణ్‌శాస్త్రి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ, అథ్‌లైట్ మధ్య భాగసామ్యం కళాశాల స్పోర్ట్స్ కమ్యూనికేటర్‌లను మరింత ప్రభావవంతంగా చేయడంలో సహాయపటానికి అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందన్నారు. ట్రిపుల్‌ఐటీలో సుదీర్ఘమైన, ఫలవంతమైన భాగస్వామ్యం కోసం ఎదురు చేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని తొండుపల్లిలో వనమహోత్సవ కార్యక్రమాన్ని మొక్కలు నాటి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో హరితహారంలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూడా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వారి బాధ్యతాయుతంగా పెంచాలని సూచించారు. చెట్లు ఉంటేనే రేపటి పౌరులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మున్సిపల్ కమిషన్ సుమన్‌రావు, కౌన్సిలర్లు లావణ్య, రాణి, వై.కుమార్, అజయ్, విజయలక్ష్మి బీఆర్‌ఎస్ నాయకలు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్సీ రహమత్ అలీ

అత్తాపూర్: కాలుష్య మహమ్మారి నుండి కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సులేమాన్‌నగర్ డివిజన్ మీరాలం పార్కులో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రహమత్ అలీ మాట్లాడుతూ.. ప్రతి మనిషికి సగటున ఐదు మొక్కలు ఉండాలని ఆ నిష్పత్తిలో గ్రీనరీని పెంపొందించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అమీనా సులేమాన్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్, మహమ్మద్ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

శంషాబాద్: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏబీవీపీ నిరంతర పోరాటం చేస్తోందని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రావుల కృష్ణ అన్నారు. మంగళవారం ఏబీవీపీ 75 జాతీయ విద్యార్థి దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక వైఎన్నార్ గార్డెన్‌లో నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఏబీవీపీ పోరాడుతూనే ఉందన్నారు. విద్యార్థులకు ఏబీవీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. జాతి పునర్‌నిర్మాణంలో ఏబీవీపీ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయిబాబా, చాకలి మహేష్, మణికంఠ, ప్రదీప్, అఖిల్, శివ, అఖిల్, చరణ్, తిరుపతి, దినేష్, విజయ్, చందు, పవన్,చరణ్, శరవణ, శ్యామ్, బంటి వినయ్, పృథ్వి, సాయి, హరి, అనూష తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్ ట్రస్ట్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

గచ్చిబౌలి: గురుకుల్ ట్రస్ట్‌లో పదుల సంఖ్యలో అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. మంగళవారం చందానగర్ సర్కిల్ పరిధిలోని గురుకుల్ ట్రస్ట్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలో జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో నోటీసులు జారీ చేసిన అధికారులు కొద్ది రోజులుగా కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో పదుల సంఖ్యలో వెలసిన అక్రమ నిర్మాణాల స్లాబ్‌లు, పిల్లర్లను నేల మట్టం చేశారు.

ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత

శంషాబాద్: శంషాబాద్‌లో ఓ వ్యక్తి ఎండీఎంఏ డ్రగ్స్‌తో పట్టుబడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. జాతీయరహదారి పక్కన ఉన్న వెంగమాంబ హోటల్ వద్ద ఓ వ్యక్తి వద్ద డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు అతడిని సోదా చేయగా 12 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ లభ్యమైంది. నిందితుడు అక్కడి నుంచి ట్రావెల్స్ బస్సులో బయలుదేరి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ సుమారు రూ.3 లక్షలు ఉండవచ్చునని అంచనా. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపారు.

చెరువులో మట్టిపోసిన వాహనానికి జరిమానా




సీజ్ చేసిన వాహనం

మణికొండ: నాలాలు, చెరువులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఓ వైపు స్వచ్ఛంద సంస్థలు, మున్సిపాలిటీలు కృషి చేస్తుండగా మరోవైపు ఓ వ్యక్తి ఏకంగా నిర్మాణ వ్యర్థాలను తెచ్చి చెరువులో పోస్తుండగా మున్సిపాలిటీ సిబ్బంది వాహనాన్ని సీజ్ చేసి జరిమానారురు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్న చెరువు పరిసరాల్లో మంగళవారం ఓ బొలెరో వాహనంలో నిర్మాణ వ్యర్థాలను తెచ్చి డంపింగ్ చేస్తున్నట్లు గుర్తించిన ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శానిటేషన్ ఇన్‌చార్జి సంపత్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాన్ని సీజ్ చేసి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. రూ.3500 జరిమానా విధించారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

మండల విద్యాధికారి డి.రామిరెడ్డి



ఎంఈఓ రామిరెడ్డికి రిపోర్టు చేస్తున్న ఉపాధ్యాయులు

అత్తాపూర్: ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గౌరవాన్ని మరింతగా పెంచుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి డి.రామిరెడ్డి అన్నారు.ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మంగళవారం మండలానికి బదిలీపై వచ్చిన ఎస్జీటీలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచానికి ధీటుగా విద్యార్థులను తీర్చిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావం, పట్టుదల క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. రాజేంద్రనగర్ మండల పరిధిలో 58 మంది ఉపాధ్యాయలు రిలీవ్‌కాగా కొత్తగా 56 మంది ఉపాధ్యాయులు మంగళవారం విధుల్లో చేరినట్లు ఎంఈఓ తెలిపారు.

సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు



రాజేంద్రనగర్: రాష్ట్ర మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణమాచారి, రాజు ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సర్వం సిద్ధం..



కొత్తగూడలో రోడ్డుపై వరద నీరు (ఫైల్)

- మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రెడీ
- 65 స్ట్రాటజిక్ లేబర్ టీమ్‌లు

- 13 మొబైల్ మాన్ సూన్ టీమ్‌లు
- 23 వాహనాలు రెడీ
- వరదను తొలగించేందుకు తక్షణ చర్యలు
- సకాలంలో సహాయక చర్యలు : జడ్సీ జె.శంకరయ్య

గచ్చిబౌలి: భారీ వర్షాల కారణంగా ఎదరయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ అధికారులు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ రెడీ చేశారు. త్వరలోనే ఆయా అధికారులకు బాధ్యతలు అప్పగించనున్నారు. అత్యవసర సమయంలో వరదను, వర్షం వల్ల ఏర్పడే ఇబ్బందులను తొలగించేందుకు మొబైల్ టీమ్‌లను సిద్ధం చేయనున్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీలో భాగంగా వెస్ట్ జోనల్‌లో 13 మొబైల్ టీమ్‌లు పని చేయనున్నాయి. యూసూఫ్‌గూడ సర్కిల్‌లో 3, శేరిలింగంపల్లి సర్కిల్‌లో 4, చందానగర్ సర్కిల్ 2, ఆర్సీపురం పటాన్‌చెరు సర్కిల్ 4 మొబైల్ టీమ్‌లను అందుబాటులో ఉంచిన్లు వెస్ట్ జోనల్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. వెస్ట్ జోనల్‌లోని నాలుగు సర్కిళ్లలోని వాటర్ స్టాగ్‌నేషన్ పాయింట్ల వద్ద స్ట్రాటజిక్ టీమ్‌లు పని చేయనున్నాయి. ఈ టీమ్‌లు ఆయా సర్కిళ్ల ఈఈల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

రౌండ్ ది క్లాక్ కంట్రోల్ రూమ్‌లు

వర్షా కాలంలో చెట్లు పడిపోవడం, నాలాలు పొంగడం, కాలనీలు, అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు చేరినా కంట్రోల్ రూమ్‌లకు సమాచారం అందించాలి. ఆయా సర్కిళ్లకు త్వరలో కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు కేటాయించనున్నారు. 24 గంటలు కంట్రోల్ రూమ్ పని చేస్తుంది.

నివారణ చర్యలు ఇవీ..

- ◆ గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును మూసివేయడంతో వర్షం వస్తే ఇందిరానగర్, డీఎల్ఎఫ్, అంజయ్యనగర్‌లో ట్రాఫిక్ జామ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.
- ◆ వర్షం వచ్చే సమాచారాన్ని ముందే టీ కారిడార్‌లో పని చేసే వారికి తెలియజేయడం, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి.
- ◆ వరద ఉన్న రహదారుల వైపు వాహనాలు రాకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్ల వైపు ట్రాఫిక్‌ను మళ్లించాలి.
- ◆ నాలాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, మ్యాన్ హోల్స్‌లో పూడిక తీస్తే కొంత వరకు సమస్యను తగ్గించేందుకు వీలుంటుంది.



వాటర్ లాగింగ్ పాయింట్లు ఇవీ..

శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో భారీ వర్షం వస్తే వాటర్ స్టాగ్‌నేషన్ పాయింట్ల వద్ద భారీగా వరద చేరే అవకాశం ఉంది. గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ ముందు, డీఎల్ఎఫ్, బయోడైవర్సిటీ జంక్షన్, మాదాపూర్ ఫేజ్–2, నెక్టార్ గార్డెన్, మాదాపూర్ మెయిన్ రోడ్డు, శిల్పారామం, కొత్తగూడ జంక్షన్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, పాపిరెడ్డినగర్ కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి, దీప్తిశ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్, ఖాజాగూడ, లిడ్క్యాప్ సమీపంలోని జూబ్లీహిల్స్ లింకు రోడ్డు తదితర చోట్ల వరద నీరు చేరుతున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించారు.



వరద నీటిలో ఐటీ ఉద్యోగుల అవస్థలు (ఫైల్)

సిద్ధంగా ఉన్నాం..



మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేశాం. త్వరలో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమిస్తాం. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పని చేసేందుకు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో నాతో పాటు ఉప కమిషనర్లు విధులు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో పని చేసేందుకు మొబైల్ టీమ్‌ల ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. కంట్రోల్ రూమ్‌లు ఎళ్లవేళలా పనిపని చేస్తాయి., వర్షంతో ఇబ్బందులు ఎదురైతే సమాచారం అందించాలి. అత్యవసర సమయాల్లో ప్రజాప్రతినిధులు, వాహనదారులు, స్థానికులు జీహెచ్ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులకు సహకారం అందించాలి. – పి.ఉపేందర్ రెడ్డి, కమిషనర్, వెస్ట్ జోన్

వర్షం వస్తే గోదారులే

వర్షం వచ్చిందంటే గత కంటి రోడ్లపై వరద నీరు ఎక్కువగా చేరే అవకాశం ఉంది. ఐటీ కారిడార్‌లో 30 కిలో మీటర్ల లక్ష్యంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో చోట్ల వరద నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోయాయి. ప్రధాన రహదారుల వెంట వరద కాల్వల నిర్మాణం లేకపోడంతో నాలాలు, మ్యాన్ హోళ్లలో చెత్త, చెదారం చేరడంతో కొన్ని చోట్ల వరద రోడ్లపై ప్రవహిస్తోంది. శిల్పారామం, మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్, దీప్తి శ్రీనగర్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు చేరనుంది.